క్లుప్తంగా

కేవీ పాలెంలో నేటి నుంచి ఆధార్ క్యాంపు

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారి పాలెం సచివాలయంలో సోమవారం నుంచి గురువారం వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌లో తప్పులు ఉన్నవారు, ఆధార్‌లేని చిన్న పిల్లలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగ పింఛన్లకు సంబంధించి సోమ, మంగళవారాల్లో గ్రామాల వారీగా టీమ్ ఇంటింటా తనిఖీ చేస్తారని తనిఖీకి వచ్చే టీమ్‌కు సహకరించాలని ఎంపీడీవో కోరారు.

లారీ-స్కూటీ ఢీ-ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు ప్రేమ్‌చంద్

జే.పంగులూరు: ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న స్కూటీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి గుంటూరు వైపు లారీ వెళ్తోంది. దాని వెనుక మంగళగిరికి చెందిన ఇద్దరు స్కూటీపై వెళ్తున్నారు. జాగర్లమూడివారిపాలెం వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీట్టారు. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న ప్రేమ్ చంద్‌తో వెనకవైపు కూర్చున్న మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి

పర్చూరు (చినగంజాం): సైకిల్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడిని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈఘటన పర్చూరులోని పిడుగురాళ్ల-వాడరేవు రోడ్డులో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పర్చూరుకు చెందిన తూమాటి సుబ్బయ్య (74) స్థానికంగా ఉన్న ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో సెక్యూరిటీగా పనిచేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం స్కూల్‌లో విధులు ముగించుకొని తన సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ అతనిని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే తీవ్రగాయాలై మృతి చెందాడు. గతంలో లస్కర్‌గా పనిచేసి రిటైర్ అయిన సుబ్బయ్య ప్రస్తుతం వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుమారు నాలుగు నెలల క్రితం భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు

అద్దంకి రూరల్: భర్తతో కలిసి గుడివెళ్లిన వివాహిత తిరిగి ఇంటికి రాకపోవటంతో ఆదివారం భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై సైదయ్య వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన కుమ్మిత గోపాల్‌రెడ్డి తన భార్యతో కలిసి శనివారం మండలంలోని శింగరకొండ దేవస్థానానికి వెళ్లారు. ఇద్దరూ కలిసి పూజ చేయించుకున్న అనంతరం గోపాల్‌రెడ్డి తనకు పని ఉంది ఇంటి వెళ్లమని భార్యకు చెప్పి వెళ్లిపోయాడు. తరువాత భార్యకు ఒకసాని ఫోన్‌చేయగా కొండపైనున్న నరసింహస్వామి దేవస్థానానికి వెళ్తున్నానని సమాధానం చెప్పింది. మళ్లీ అరగంట తరువాత ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానంతో బంధువులు, స్నేహితుల సమాచారం తెలుసుకోగా అక్కడికి రాలేదనటంతో తప్పిపోయిందని అనుమానంతో ఆదివారం రాత్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఏఎస్సై కేసు నమోదు చేశారు.



గన్నవరం-మార్టూరు దండు దారి వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



పూనూరు-చింతగుంటపాలెం మధ్య రోడ్డు



మున్నంగివారిపాలెం, జాగర్లమూడి వెళ్లే దారిలో

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి

- గ్రానైట్ రాళ్ల టిప్పర్లతో రహదారులు ధ్వంసం
- అడుగడుగునా గుంతలు.. వాహనదారులకు తప్పని తిప్పలు
- అవస్థలు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- పట్టించుకోని కూటమి నాయకులు, అధికారులు

యద్దనపూడి: మేం అధికారంలోకి వస్తే.. తమ్ముళ్ల గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తాం. అని ఎన్నికల ముందు కూటమి నాయకులు డాంబికాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక తెప్పతగలేసినట్లు అబద్ధపు ప్రచారాలతో కాలం గడుపుతోంది. అంతేకాదు కూటమి సీఎం చంద్రబాబు నాయుడు కొత్త పంథాను ముందుకు తీసుకువచ్చాడు. రాష్ట్ర పరిధిలో ఉండే రహదారులకు.. గ్రామీణ రోడ్లకు టోల్ వసూలు చేసి పబ్లిక్, ప్రైవేటు సాయంతో అభివృద్ధి చేస్తామని చెప్పాడు. దీంతో ప్రజలు రోడ్లకు టోల్ కట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలు గడిచినా గ్రామీణ రోడ్ల పరిస్థితి మారలేదు. పల్లెలను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని ప్రజాప్రతినిధులు చెప్పిన వాగ్దానాలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. దీంతో రహదారుల మీద ప్రయాణం దుర్భరంగా మారింది. ఓ రకంగా చెప్పాలంటే ఏ రోడ్డు చూసినా 'ఏమున్నది గర్వకారణం.. సమస్త రహదారులు గుంతలమయం' అన్నట్లుగా తయారయ్యాయి. దీంతో వర్షాకాలంలో ఎక్కడ గుంతో ఎక్కడ రోడ్డో అర్థం కాక ప్రజలు ప్రమాదాల బారినపడుతున్నారు. శాశ్వత మరమ్మతుల మాట ఎలా ఉన్నా కనీసం తాత్కాలిక మరమ్మతులైన చేయించలేరా అని మండలంలోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



పూనూరు-గన్నవరం రోడ్డు ఇలా..



గన్నవరం-యద్దనపూడి మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు



గన్నవరం-యనమదల మధ్య రోడ్డు దుస్థితి

వాహనదారులకు నిత్యం నరకం..

యద్దనపూడి మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాలను అనుసంధానం చేసే రహదారులు ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం వాటి రూపురేఖలు మారి అడుగుకో గుంత.. గజానికో గొయ్యిలా తయారయ్యాయి. ముఖ్యంగా మార్టూరు నుంచి గన్నవరం వచ్చే రహదారిలో ప్రతినిత్యం 45 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ టిప్పర్లు రాకపోకలు సాగించటంతో ఆ రోడ్డుమార్గం ఎక్కడికక్కడ దెబ్బతింది. భారీ వాహనాలు వెళ్లేందుకు ఆ గుంతల్లో గ్రానైట్ వ్యర్థాలు, పెద్దపెద్ద రాళ్లు వేయటంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పూనూరు-గన్నవరం మధ్య 3 కిలో మీటర్ల మేర రోడ్డు అంతా కంకర రాళ్లు బయటపడి గుంతలు ఏర్పడటం తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే పూనూరు చింతగుంటపాలెం, నూతలపాడు వెళ్లే 8 కిలోమీటర్ల రహదారి గుంటలు ఏర్పడటంతో మట్టి, కంకర రాళ్లు తోలి తాత్కాలికంగా చదును చేశారు. దీంతో ప్రస్తుతం ఆ రోడ్డుపై చిన్నచిన్న రాళ్లు బయటపడి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. యద్దనపూడి నుంచి యనమదల, అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాల మధ్య 8 కిలో మీటర్ల మేర ఉన్న రహదారి మార్జిన్లు అంచున మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు వెళ్లాలంటే రోడ్డు దిగాల్సి రావటంతో వాహనాలు అ గుంతల్లో కూరుకుపోతున్నాయి. అలాగే మున్నంగివారిపాలెం, చిమటవారిపాలెం, జాగర్లమూడి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా తయారై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలూరు నుంచి పర్చూరు వైపు వెళ్లే గర్నెపూడి రోడ్డు బురదమయంగా మారి ప్రయాణానికి వీలులేని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే ప్రాణాలతో చెలగాటమేనని వాహనదారులు వాపోతున్నారు. నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావొస్తున్నా కనీసం మరమ్మతులు చేపట్టకపోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



మండలంలోని రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. పూనూరు నుంచి గన్నవరం మధ్య 3 కిలో మీటర్ల మేర ప్రయాణించాలంటేనే అరగంటకు పైగా పడుతుంది. రాహదారులను మరమ్మతులను చేపట్టాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ఎన్నో సార్లు వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

– కుంచపు అంకమ్మరావు, పూనూరు

ప్రయాణమంటేనే భయపడాల్సి వస్తోంది



గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణమంటేనే హడలిపోతున్నాం. గన్నవరం నుంచి మార్టూరు వెళ్లే రహదారి భారీ వాహనాల కారణంగా నడుముల్లోతు భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆ మార్గం నుంచి ప్రయాణమంటేనే ప్రాణాలతో చెలగాటమే. తక్షణమే గుంతలను పూడ్చి నూతన రోడ్లను నిర్మించాలి.

– ముప్వల రాంబాబు, చిమటవారిపాలెం

దళితులను మోసం చేసిన చంద్రబాబు

చీరాల రూరల్: మేలు చేస్తానని గద్దెనెక్కిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజలకు తక్షణమే సబ్సిడీ రుణాలు మంజూరుచేసి ఆదుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు నీలం నాగేంద్రరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చీరాల వచ్చిన ఆయన దళిత మహాసభ కార్యాయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని గతంలో సాక్షాత్తు సుప్రీం కోర్టు చెప్పినా అదే వాదాన్ని భుజానవేసుకుని చంద్రబాబు తిరగడం ఏంటని ప్రశ్నించారు. గతంలో ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ తమ తీర్పులో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం రాష్ట్రాలకు ఎటువంటి అధికారం లేదని చెప్పినా చంద్రబాబు వినకుండా వర్గీకరణ చేస్తానని ఉవ్విళ్లూరడం మంచిపద్ధతి కాదన్నారు. గత ప్రభుత్వంలో కూడా ఎస్సీలకు ఏ మాత్రం న్యాయం జరగలేదన్నారు. తక్షణమే ప్రస్తుత ప్రభుత్వం స్పందించి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలన్నారు. అలానే ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు డిసెంబర్ నుంచి మార్చిలోపు ఈ నాలుగు నెలల యాక్షన్ ప్లాన్‌లో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు కులాల వారిగా వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రస్తుత సుప్రీం కోర్టు బెంచ్ ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఇచ్చిన తీర్పుగా ఆయన పేర్కొన్నారు. ఇది మోదీ ప్రాయోజిత తీర్పుగా ఉందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నానంటున్న చంద్రబాబు ముందుగా 2021 జనాభా లెక్కలను తేల్చి రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత మహాసభ నాయకుడు మాచవరపు జూలియన్, గిరిజన ఐక్యవేదిక నాయకుడు గంటా కోటేశ్వరరావు, బుజ్జిరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు నాగేంద్రరావు

విజేతలకు బహుమతులు అందజేత



గెలుపొందిన విజేతలతో క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ చార్టర్ ప్రెసిడెంట్ చదలవాడ ఫణీంద్ర బాబు తల్లిదండ్రులు చదలవాడ మోహన్‌రావు, శ్రీధర కుమారి జ్ఞాపకార్థం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లా స్థాయిలో షటిల్ టోర్నమెంట్ 7,8 తేదీలో అద్దంకిలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, పొదిలి, దర్శి, కందుకూరు, కనిగిరి, ఒంగోలు, చీరాల, రేపల్లె, పొన్నూరు, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, గుంటూరు ప్రాంతాలననుంచి 100 టీమ్‌ల వరకు క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో మొదటి బహుమతి గెలుచుకున్న నరసరావుపేట క్రీడాకారులు ధీరజ్, ధనుష్, రెండో బహుమతి పొదిలి టీమ్, మూడో బహుమతి రేపల్లె టీమ్, నాలుగవ బహుమతి అద్దంకి టీమ్, ఐదవ బహుమతి రాము, కోటిలకు ఫణీంద్రబాబు, రంగిశెట్టి సాంబశివరావు, చక్కా సుబ్బారావు, మోతుకూరి సుభాష్‌బాబులు నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్ చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ కృష్ణ, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్నమురళీ కృష్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా క్రిస్మస్ సందడి



బల్లికురవలో ఏర్పాటు చేసిన భారీ స్టార్



పాత మల్లాయపాలెం చర్చిపై ఏర్పాటు చేసిన స్టార్

బల్లికురవ: క్రిస్మస్ పండుగకు చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించి వేడుకలకు స్వాగతం పలికేందుకు భారీ స్టార్‌లు ఏర్పాటు చేశారు. బల్లికురవ నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, కొప్పరపాలెం, ఉప్పుమాగులూరు, కొణిదెన, చెన్నుపల్లి, కూకట్లపల్లి, కొప్పరపాడు, వల్లాపల్లి, అంబడిపూడి గ్రామాల్లో ప్రతి రోజు రాత్రి ఎనిమిది గంటలనుంచి పది గంటల వరకు పాస్టర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపడుతున్నారు. మహిళలు ఇళ్లను శుభ్రపరుస్తున్నారు. వేడుకలకు సూదూర ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా రావటంతో ప్రతి ఇంటా సందడి నెలకొంది. ఇళ్ల ముందు చిన్నచిన్న స్టార్‌ల ఏర్పాటు చేసి పండుగకు మరింత శోభ తెచ్చారు.

నేత్రదానం మహాదానం



జీ ముత్యాలు (ఫైల్)



జీ తులశమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): నేత్రదానంతో ఒకరికి చూపు తెప్పించవచ్చని వైద్యులు తెలిపారు. మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన జాగర్లమూడి ముత్యాలు (82), కారంచేడు మండలం జరుబులు వారిపాలెం గ్రామానికి చెందిన జరుబుల తులశమ్మ (95) ఆదివారం మృతి చెందడంతో వారి బంధువులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రాలను దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు దాతల నేత్రాలను సేకరించారు. అడిగిన వెంటనే స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ముత్యాలు కుమారులు వాసుబాబు. రవీంద్ర కుటుంబ సభ్యులు జాగర్లమూడి శివప్రసాద్‌లను, తులశమ్మ కుటుంబ సభ్యులను అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ షేక్ రఫి, చుండి సాంబశివరావులు పాల్గొని అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

అద్దంకి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పలువురు వక్తలు పేర్కొన్నారు. నేస్తం మిత్రమండలి ఆధ్వర్యంలో విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఆదివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కేవీ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఎంఈవో బూదాటి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ శ్రీనివాసరావు వృత్తి ధర్మంతో పనిచేశాడని కొనియాడారు. పనిచేసిన ప్రతి పాఠశాలలో నిబద్ధతతో పనిచేశారన్నారు. ఆయన తిమ్మాయపాలెం పాఠశాలకు చేసిన సేవలు మరవలేనివని చెప్పారు. తరువాత ఆయన్ను దుశ్శాలువాతో మెంమెంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేస్తం గ్రూపు ఉపాధ్యాయులు సోమేపల్లి హనమంతరావు, చప్పిడి కేశవరావు, దామా సుబ్బారావు, కావూరి రఘచంద్ ప్రధానోపాధ్యాయులు పోపూరి అంజలి, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప దీక్షాధారులు



మక్కెనవారిపాలెంలో మెట్ల పూజ నిర్వహిస్తున్న అంకమ్మరావు



అలంకరణలో అయ్యప్ప స్వామి

అద్దంకి రూరల్: అఖిల భారత అయ్యప్ప దీక్షాప్రచార సమితి స్వామి సత్యసైన్య సేవాసమితి వారిచే ఆదివారం రాత్రి స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం ఎదుట అయ్యప్ప స్వామి వారి పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమానికి అయ్యప్ప, భవాని, శివ దీక్షాధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురుస్వాములు అయ్యప్ప స్వామివారిని, మెట్ల పూజను నిర్వహించారు. స్వాములు చేసిన భజన కార్యక్రమం, పాటలు అందర్ని ఆకట్టుకున్నారు. పరిసరాలు అయ్యప్ప నామంతో మార్మోగాయి. సంతమాగులూరులో మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో కోపూరి అంకమ్మస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల్లోని అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమానాస్పద యువకుడిపై కేసు

అద్దంకిరూరల్: అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించి యువకుడిపై ఆదివారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై సైదయ్య వివరాల మేరకు.. శనివారం రాత్రి గస్తీ నిమిత్తం పోలీసులు స్థానిక అద్దంకి బస్టాండ్‌కు వెళ్లారు. అక్కడ ఒక యువకుడు పోలీసులను చూసి పరుగెత్తుతుండగా అతనిని పట్టుకుని అతని వద్దనున్న సంచిని పరిశీలించగా ఒక స్క్రూడ్రైవర్, పట్టకారు ఉన్నాయి. ఇళ్లలో చోరీలకు ఉపకరించే సామగ్రిగా ఉండటంతో యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

మేకలు మేసే విషయంలో పరస్పర దాడులు

చీరాల: మేకలు మేపుకునే విషయంలో స్థలం వద్ద ఏర్పడిన వివాదం పరస్పర దాడులు చేసుకుని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. చీరాల మండలంలోని బోయినవారిపాలెంకు చెందిన వెంకట్రావు, గోపిలు మేకలు మేపుకునే విషయంలో స్థలం వద్ద ఏర్పడిన వివాదం వెరసి పరస్పరం దాడులు చేసుకునేవరకు దారితీసింది. వెంకట్రావు గొడ్డలితో, గోపి కర్రతో దాడులు చేసుకోగా ఇరువురు ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాన సత్ర అధ్యక్షుడిగా కనకరత్నాచారి



అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం అధ్యక్ష పదవికి సంఘపెద్దలు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 1450 మంది వరకు విశ్వబ్రాహ్మణులు హాజరయ్యారు. అధ్యక్షుడిగా కనకరత్నాచారిని సంఘపెద్దలు ఎన్నుకున్నారు.